

నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

## కేంద్రానికి వ్యతిరేకంగా
# లారీ డ్రైవర్స్, క్లీనర్స్ ఆందోళన

**'హిట్ అండ్ రన్' కేసులకు కఠినశిక్షల ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్**

ఖలీల్‌వాడి/ నిజామాబాద్ స్పోర్ట్స్/ పిట్లం, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ఉమ్మడి జిల్లాలోని లారీ డ్రైవర్లు, క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఐపీసీ 304/ఏ సెక్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ కలెక్టరేట్ ఎదుట, పిట్లం మండలకేంద్రంలో లారీ, డీసీఎం ఓనర్స్, డ్రైవర్లు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నిజామాబాద్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి.దావూద్ అలీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెక్షన్ 304/ఏ ద్వారా డ్రైవర్ల జీవితాలు అయోమయంలో పడ్డాయన్నారు. లారీ, డీసీఎం ఓనర్లకు ఇబ్బంది కలిగించే సదరు సెక్షన్‌ను రద్దు చేసి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నవీద్ పాషా, సంఘ సభ్యులు పాల్గొన్నారు. పిట్లంలో నిర్వహించిన ధర్నాలో అధ్యక్షుడు కరీం, గౌరవ అధ్యక్షుడు మిర్జా సలీం, ఉపాధ్యక్షులు బుడాల నవీన్, మొయిదిన్ పాటిల్, కార్యదర్శి హన్మాగౌడ్, కోశాధికారి ఆసీఫ్ బేగ్, ఆర్గనైజర్ ఖుద్దూస్, ముఖ్య సలహాదారులు లక్ష్మణ్, మహెబూబ్, యాదుల్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## హరిలోరంగ హరి..



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థినులు అందమైన ముగ్గులు వేసి పండుగకు స్వాగతం పలుకగా.. కొందరు హరిదాసు వేషధారణలో అలరించారు. కొన్ని పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.





కలెక్టరేట్ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

## నిధులు విడుదల చేయాలి
### నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారుల ధర్నా

నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 11: రెండో విడుత మంజూరైన దళితబంధును వెంటనే విడుదల చేయాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ భూమయ్య మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని, మొదటి విడుత అమలైన తర్వాత రెండో విడుత లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశారన్నారు. బ్యాంకు ఖాతాల పరిశీలన, గ్రౌండింగ్ వర్క్ పూర్తయ్యిందని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా పథకాన్ని నిలిపివేశారని, ఎన్నికల అనంతరం ఆన్ గోయింగ్ స్కీమ్ కింద లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాల్సి ఉన్నా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దళితులపై కక్షగట్టి దళితబంధును ఆపుతున్నదని ఆరోపించారు. వెంటనే నిధులు విడుదల చేసి దళిత కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడాలని విజ్ఞప్తిచేశారు. నిధుల విడుదల చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన దళిత సంఘాల నాయకులు, దళితబంధు లబ్ధిదారులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం సమర్పించారు.

# 'ప్రజాపాలన' పేరుతో కాలయాపన

- వందరోజుల్లో హామీలను అమలుచేయాల్సిందే
- లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాడుతాం
- కేసీఆర్ పథకాల రద్దుకు రేవంత్ ప్రభుత్వం కుట్ర
- నిజామాబాద్ ఎంపీ స్థానం ఈసారి బీఆర్ఎస్‌దే
- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ రూరల్, జనవరి 11 : ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజాపాలన కార్యక్రమం పేరుతో కాలయాపన చేస్తున్నదని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. సాధ్యంకాని హామీలు గుప్పించి మాయ మాటలతో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నదని మండిపడ్డారు. నెలరోజుల పాలనతోనే ఆ పార్టీ వైఖరి ఏంటో స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభు త్వం నెల రోజుల పాలన, గ్యారెంటీ హామీల అమలుపై అవలంబిస్తున్న తీరుపై మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి, రైతాంగ శ్రేయస్సు కోసం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటి రద్దు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. సదరు ఆలోచనను వెంటనే విరమించుకోకపోతే ప్రజల పక్షాన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేసేందుకు వెనుకాడబోరని హెచ్చరించారు. అధికారం చేపట్టిన తేదీ నుంచి వంద రోజుల్లోగా గ్యారెంటీ హామీలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా పోరాడేందుకు సంసిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడంతో పాటు తెలంగాణకు లక్షల కోట్ల ఆస్తులు సమకూరినట్లు తెలిపారు. వీటిని వెల్లడించకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. కుళ్లు బుద్ధితో రాష్ట్రం అప్పుల పాలైందని కుంటి సాకులు చెబుతూ గ్యారెంటీ హామీలు అమలు చేయకుండా తప్పించుకునేందుకు యత్నిస్తున్నదని మండిపడ్డారు. త్వరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఈసారి బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ఏడు నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమష్టిగా ముందుకు సాగాల్సిన అవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలని సూచించారు. పకడ్బందీ వ్యూహంతో విపక్ష పార్టీల నాయకుల కల్లబొల్లి, మోసపూరిత మాటలను నమ్మకుండా ప్రజలను చైతన్యపర్చేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# బ్రేక్!

- లబ్ధిదారుల ఖాతాలు ఫ్రీజ్..
- దళితబంధు నిధుల కోసం ఎదురుచూపులు
- ఆందోళనలో లబ్ధిదారులు

**దళితుల** సాధికారత కోసం కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఇచ్చి దళితుల అభ్యున్నతికి పాటుపడేలా పథకాన్ని రూపొందించారు. స్వయం ఉపాధి, పరిశ్రమలు, వ్యాపారం నిర్వహించేలా దళితులను ప్రోత్సహించేందుకు ఆర్థిక చేయూతనందించింది. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌ను పైలెట్ మండలంగా ఎంపిక చేసింది. మొదటి విడుతలో 1298 మంది దళిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున అందజేసింది. దీంతో వారంతా వివిధ వ్యాపార, వాణిజ్య స్వయం ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

-నిజాంసాగర్, జనవరి 11

రెండో విడుతలో 238 మందితో కూడిన జాబితాను ప్రభుత్వానికి అందజేయగా, అందులో 208 కుటుంబాలకు డబ్బులు విడుదలయ్యాయి. మిగతా 30 కుటుంబాలకు వివిధ కారణాలతో నిలిచిపోయాయి. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఖాతాల్లో నిధులు జమ అయినా.. విడుదలకు బ్రేక్ పడింది. దీంతో ఎన్నికల అనంతరం డబ్బులు వస్తాయనుకున్న దళితబంధు లబ్ధిదారులకు షాక్ తగిలింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దళితబంధు నిధుల విడుదలకు ఎలాంటి ఆదేశాలూ ఇవ్వకపోవడంతో ఖాతాలు నిలిచిపోయాయి. దీంతో దళితబంధు వస్తుందా? లేదా? అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రౌండింగ్ పూర్తయిన యూనిట్లకు నిధులు ఖాతాల్లో జమ అయినా.. బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడమేంటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

### అధికారులకు వినతులు..

దళితబంధు పథకంలో భాగంగా గ్రౌండింగ్ పూర్తయిన యూనిట్లకు నిధులు మంజూరు చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఖాతాల్లో పడిన డబ్బులను ఇప్పించాలని అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. దళితుల జీవితాలను మార్చేందుకు తీసుకువచ్చిన పథకాన్ని కొనసాగించాలని, ఎంపికైన లబ్ధిదారులందరికీ నిధులు విడుదల చేయాలని కలెక్టర్లను కోరుతున్నారు.



### మిగిలిన డబ్బులు ఇస్తలేరు..

దళితబంధు పథకం కింద కారు తీసుకున్నా. ఇంకా రూ.లక్షా 90వేలు నా ఖాతాలో మిగిలిపోయాయి. వాటి కోసం రోజూ అధికారుల వద్దకు వెళ్తున్నా. రేపు, మాపు అంటున్నారు. ఇప్పటికైనా నా ఖాతాలో ఉన్న డబ్బులు అందిస్తే ఇంటి వద్ద మరో చిన్న వ్యాపారం పెట్టుకుంటా. ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయని, టైం పడుతుందని అధికారులు చెబుతుండ్రు.

**- సాయిబాబా, తున్కిపల్లి**



### రేపు.. మాపు అంటుండ్రు..

మా కుటుంబానికి దళితబంధు పథకం కింద రూ.10లక్షలు మంజూరయ్యాయి. ఇంతలో నా భర్త చనిపోయిండు. ఆయనకు మంజూరైన పథకాన్ని నా పేరు మీదకు మార్చారు. నా ఖాతాలో రూ.10లక్షలు జమ అయిన ప్పటికీ అధికారులు ఫ్రీజ్ చేశారు. ఇదేమిటని అడిగితే ఈరోజు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారు.

**- చంద్రవ్వ, మహ్మద్‌నగర్**

## ఇంటి బాట!



సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నుంచి బడులకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. విద్యార్థులు గురువారమే ఇంటిబాట పట్టారు. దీంతో నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్ పట్టణాల్లోని బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ నెలకొన్నది. ప్లాట్‌ఫారాలన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి.

బాన్సువాడలో..



ప్రధాన కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

# నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, జనవరి 11: నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న యాసంగి పంటల కోసం మూడో విడుత నీటి విడుదలను గురువారం ప్రారంభించినట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ఉదయం వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా మధ్యాహ్నానికి రెండు వేల క్యూసెక్కులకు పెంచి ప్రధాన కాలువ ద్వారా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న లక్షా 35 వేల ఎకరాలకు మొత్తం ఆరు విడుతల్లో నీటిని విడుదల చేయనున్నామని ఇప్పటి వరకు నవంబర్, డిసెంబర్ నెలల్లో రెండు విడుతల్లో 2.99 టీఎంసీల నీటిని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం మూడో విడుత ప్రారంభించామని రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదలను హెచ్చుతగ్గులుగా పదిరోజులపాటు విడుదల చేస్తామని తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం మొత్తం 1405.00 అడుగుల (17.80 టీఎంసీలు)కు గాను ప్రస్తుతం 1401.97 అడుగుల (13.64 టీఎంసీలు) వద్ద ఉన్నదని పేర్కొన్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

# క్రీడాపోటీలకు చక్కని వేదిక కామారెడ్డి

- ఇక్కడ ఏ కార్యక్రమం నిర్వహించినా విజయవంతమవుతుంది
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- జిల్లాకేంద్రంలో ముగిసిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



మూడోస్థానంలో నిలిచిన తెలంగాణ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కలెక్టర్ జితేశ్ పాటిల్

కామారెడ్డి, జనవరి 11 : ఎలాంటి క్రీడా పోటీలకైనా చక్కని వేదిక కామారెడ్డి పట్టణమని స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. పోటీల నిర్వహణకు ఇక్కడ పుష్కలంగా వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 7న ప్రారంభమైన జాతీయ స్థాయి (అండర్ -17) బాలుర కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితో పాటు ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు చాలా మంది దాతలు ముందుకు వచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కామారెడ్డిలో ఏ కార్యక్రమం నిర్వహించినా అందరి సహకారంతో విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. కామారెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, డీఈవో రాజు, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం,పరీక్షల విభాగం అధికారి నీలం లింగం, డీఎస్‌వో సిద్ధిరాంరెడ్డి, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు దామోదర్ రెడ్డి, అనిల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా రాష్ట్రాల క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విజేత హర్యానా..

చివరిరోజు హర్యానా వర్సెస్ కర్ణాటక జట్లు ఫైనల్‌లో పోటీపడ్డాయి. పోటీలో 58–51 పాయింట్లు సాధించి 7 పాయింట్ల తేడాతో హర్యానా గెలుపొందింది. రెండో స్థానంలో కర్ణాటక, మూడో స్థానంలో తెలంగాణ, నాల్గో స్థానంలో ఢిల్లీ నిలిచాయి. విజేత జట్లకు అతిథులు ట్రోఫీలను అందజేశారు.



ఫైనల్‌లో తలపడుతున్న హర్యానా, కర్ణాటక జట్లు